క్లుప్తంగా

విశ్వకర్మ యోజన ఐడీ కార్డుల పంపిణీ



జనగామ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన ఐడీ కార్డులను బుధవారం 27వ వార్డులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సొడ రమేష్, లగిశెట్టి వీరలిం గం, వంగాల రవి, ఎర్రం ప్రసాద్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

వానరాల స్వైరవిహారం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో వానరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు, గుంపులుగా కోతులు సంచరిస్తూ రెచ్చిపోతున్నాయి. బుధవారం ఏకంగా ముగ్గురిపై దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన శాగ యాదగిరి, కావటి బాల కొమురయ్య, ఉడుత పెద్దగట్టుమల్లుపై దాడి చేశాయి. శాగ యాదగిరిపై గుంపులుగా కోతులు దాడి చేయడంతో గాయాలవడంతో కుటుంబ సభ్యులు జనగామ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో తిరుగు వారం

జనగామ: జనగామ బతుకమ్మకుంట విజయదుర్గా మాత జాతర ఉత్సవాల్లో భాగంగా నేడు (గురువారం) తిరుగు వారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు పిట్టల సత్యం, కర్రె శ్రీనివాస్, మేడ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి తిరుగు వారం పండగ మొదలవుతుందని, అమ్మవారి సన్నిధికి వచ్చి దుర్గాదేవి ఆశీస్సులు పొందాలన్నారు.

నేడు 'వేద'లో స్వర్ణ ప్రాశన

జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డు ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో నేడు(గురువారం) 0 నుంచి 16 ఏళ్ల పిల్లలకు స్వర్ణ ప్రాశన వేయడం జరుగుతుందని డాక్టర్ అంజిరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రాంభమవుతుందని చెప్పారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జనగామ ఏసీపీ కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సీఐ దామోదర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని యువతీ, యువకులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేసి మానవత్వాన్ని చటుకోవాలన్నారు.

విమర్శలు సరికాదు

బచ్చన్నపేట: మండలంలోని పలు పార్టీల నాయకులు స్థాయిని మరిచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొందరు కాంగ్రెస్ నాయకులు అర్హత లేకున్నా పలు ప్రారంభాలకు హాజరవుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయిన వారికి ప్రొటోకాల్ ఉందని రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.

రైస్ మిల్లులు కేటాయించాలి



జనగామ రూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తక్షణమే రైస్ మిల్లులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు కోరారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. తూకాల్లో కోతలు పెట్టకుండా అధికారులు పర్యవేక్షణ చేసి కాంటాలు నిర్వహించాలన్నారు.

పౌష్టికాహారం అందించాలి



బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో అర్హులందరికీ పౌష్టికాహారం అందించాలని మండలంలోని జీపీ కార్యదర్శులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లోని గుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించి టీచర్లకు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

సాగునీటికి రైతుల అవస్థలు

- మరమ్మతుకు నోచుకోని బంజరు కాల్వ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పాంనూర్‌లోని బంజరుకాల్వ



కాల్వలో అడ్డంగా పెరిగిన పిచ్చిచెట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో పాంనూర్ గ్రామంలోని బంజరుకాల్వ దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో సాగునీటి కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతుంది. బంజరుకాల్వకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతు పనులు చేపట్టి సాగునీరు అందించాలని గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పాంనూర్ గ్రామ శివారులోని బంజరుకాల్వ శిథిలం కాగా పూడుకుపోయింది. కాల్వ శిథిలం కావడంతో పాటు కాల్వలో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దాంతో కాల్వ పూర్తిగా పూడుకుపోయి బంజరుకాల్వ ద్వారా నీరు ముందుకు వెళ్లడం లేదు. ఘన్‌పూర్ రిజర్వాయర్ పూర్తయి అక్కడి నుంచి దాదాపు 16ఏళ్లుగా సాగునీరు వస్తున్నా బంజరుకాల్వ శిథిలమై పూడుకుపోవడంతో రైతులకు సాగునీరు రావడం లేదు. బంజరు కాల్వను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువస్తే మొత్తంగా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో 550 ఎకరాలు పాంనూర్, 250 ఎకరాలు చిల్పూరు మండలం నష్కల్, 250 ఎకరాలు జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామాలకు సాగునీరు అందుతుంది.

కాల్వకు పలుచోట్ల గండ్లు

దాదాపు 80 ఏళ్ల క్రితం గ్రామంలో నిర్మాణం చేపట్టిన బంజరుకాల్వకు పలు చోట్ల గండ్లు పడటం, తుమ్మచెట్లు, పిచ్చిచెట్లు పెరిగి కాల్వలు పూర్తిగా పూడ్చుకుపోవడంతో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాల్వ పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.

కాల్వకు శాశ్వత మరమ్మతు చేయాలి



బంజరుకాల్వకు శాశ్వత మరమ్మతు చేయాలి. ఈవిషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏళ్లతరబడి ఎదురు చూస్తున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వకు మరమ్మతు చేస్తే వందలాది ఎకరాలకు ప్రయోజనంగా ఉంటుంది.

– ఒగ్గు రాజు, రైతు

తీరని సమస్యగా బంజరుకాల్వ



బంజరుకాల్వ సమస్య రైతులకు తీరని సమస్యగా మారింది. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కావడం లేదు. కాల్వకు శాశ్వత మరమ్మతు చేస్తే రైతులకు రెండు పంటలకు సరిపడా సమృద్ధిగా సాగునీరు అందుతుంది. పాంనూర్‌తో పాటు నష్కల్, ఉప్పుగల్లు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎండీ.అన్వర్, రైతు

ఆలయాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు

లింగాలఘణపురం/చిల్పూరు/బచ్చన్నపేట: నవాబుపేట కోదండరామస్వామి, చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి, బచ్చన్నపేట మండలం కొడవటూర్‌లోని స్వయంభూ సిద్ధేశ్వర ఆలయాల్లో బుధవారం నైమిశారణ్య హిందూ ధార్మిక సేవాసమితి పీఠాధిపతి బాల బ్రహ్మానందసరస్వతి స్వామిజీ.. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కాగా, భక్తులు విని తరించారు. అనంతరం స్వామిజీని శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ పూజారులు, ఈఓలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



చిల్పూరు: ప్రవచనాలు చేస్తున్న స్వామిజీ

ధరణి పనులు పెండింగ్‌లో ఉండొద్దు



రెవెన్యూ పనులపై సమీక్షిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

లింగాలఘణపురం: ధరణిలో దరఖాస్తు చేసుకున్న రైతుల పనులు పెండింగ్‌లో ఉండవద్దని జనగామ ఆర్డీఓ కొమురయ్య అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రెవెన్యూ పనులపై సమీక్షించారు. ప్రజాదర్బార్, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కూడా పరిశీలించి వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పనులతో పాటు దేవాదుల కాలువ పనుల్లో మిగిలిపోయిన భూసేకరణ పనులపై కూడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయనతో పాటు తహసీల్దార్ రవీందర్, సిబ్బంది ఉన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో ఇప్పగూడేనికి అన్యాయం'

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల నియమించిన మార్కెట్ కమిటీ నామినేటెడ్ పోస్టుల్లో మేజర్ గ్రామ పంచాయతీ అయిన మండలంలోని ఇప్పగూడెం గ్రామంపై చిన్నచూపు చూశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొండం రాజిరెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జగిరిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇప్పగూడెం గ్రామం నుంచి మంచి మెజార్టీ వచ్చిందన్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న ఇప్పగూడెం గ్రామానికి కనీసం ఒక మార్కెట్ డైరెక్టర్ పోస్టు దక్కకపోవడం బాధాకరమన్నారు. గతంలో జనగామ నియోజకవర్గంలో ఉన్నసమయంలో పాలకులు ఇప్పగూడెంకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పగూడెంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని, తేలిక పాటి వర్షాలకే కాలనీలు జలమయంగా మారుతున్నాయన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

బచ్చన్నపేట: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి అన్నారు. మండలంలోని కట్కూర్, బండనాగారం, బసిరెడ్డిపల్లి, ఆలింపూర్, పోచన్నపేట గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్‌గుప్తాతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, నాయకులు మాసపేట రవీందర్‌రెడ్డి, జంగిటి విద్యానాథ్, ఆముదాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేస్తున్న సీఎం'



రఘునాథపల్లి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే ఉద్యోగాలు భర్తీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల ఉదయ్‌మాదిగ పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఎంఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీలో వర్గీకరణ లేకుండానే 11 వేల పోస్టులు భర్తీ చేయడంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గ్రూపు 1, 2, 3లో కూడా వర్గీకరణ లేకుండానే భర్తీ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఇదే జరిగితే మాదిగలకు ఉప కులాలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. వర్గీకరణ అమలు కోసం గురువారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో జరిగే విద్యార్థుల రాష్ట్ర సదస్సుకు విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎంఎస్ఎఫ నాయకులు సింగపురం అఖిల్, నవీన్, సందీప్, నవీన్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



సేవలను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

నర్మెట: మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా మినీ బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నెలకొల్పిన మినీ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నిర్వాహకులు కాశెట్టి బాలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలి



సభ్యత్వ నమోదులో కొండేటి శ్రీధర్

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో బీజేపీ శ్రేణులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేయాలని పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలో బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లందుల సారయ్య, ప్రధాన కార్యదర్శి గడ్డం లింగస్వామి, బీజేపీ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బూర్ల విష్ణు, నాయకులు కోరుకొప్పుల నాగేష్, సాయిరామ్, సందీప్, శ్రీను, బుచ్చయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ పాలకొండ వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఘన్‌పూర్, చిల్పూరు మండలాల ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.33వేల సాయం బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా వారు వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం ప్రగాఢ సంతాపం తెలిపారు. అసోసియేషన్ నాయకులు గట్టయ్య, కుమారస్వామి, మోతె రాజు, కొమురెల్లి, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

50 కిలోల బియ్యం అందజేత

ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్ కుమారుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇల్లందుల రాజనారాయణ మృతుడు వెంకటేశ్వర్లు కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించారు. వేణు, వినయ్, చిరంజీవి, రవీందర్, శ్రీధర్ ఉన్నారు.

నేలపోగులలో..

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల ఆకుల నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి 75కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాజు, అశోక్, సత్తయ్య, కొంరయ్య, వెంకన్న, శ్రీకాంత్ ఉన్నారు.

పెద్దమడూరులో..

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో గుండెపోటుతో దూడల సోమయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, ఆదర్శ యువ మండలి మాజీ అధ్యక్షుడు నల్ల ఉమేష్ బాధిత కుటుంబానికి బియ్యం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ధర్మాపురంలో..

దేవరుప్పుల: మండలంలోని ధర్మాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోతుగంటి యాదగిరి, ఉప్పలయ్య తల్లి మృతి చెందగా ఆ కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుంద్‌రామిరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే లక్ష్మణ్‌తండాలో బీఆర్ఎస్ నాయకుడు వీర్‌నాయక్ తల్లి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



పాలకుర్తి టౌన్: శాంతి భద్రతలను పరిరక్షించేందకు కృషి చేస్తానని పాలకుర్తి ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన పాలకుర్తి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో అక్రమ వ్యాపారం అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాలు, గుట్కా,గుడుంబా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఎవరు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళా భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

దేవరుప్పుల: మహిళల భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా మహిళ విభాగం కన్వీనర్ దాసగాని సుమ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కీర్తన, మానస, ధన్వంతి, చందన, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో ఏకపక్షంగా వేసిన ఇందిరమ్మ కమిటీని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు తాటికొండ సంపత్‌యాదవ్ అన్నారు. తాటికొండలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో పాత, కొత్త కాంగ్రెస్ నాయకులను కలుపుపోవాలని, పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమక్షంలో ఇందిరమ్మ కమిటీని వేయాలన్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి, పదేళ్లుగా పార్టీని పట్టుకుని ఉన్న వారిని కాదని పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు ఏకపక్షంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

'కొండా' పుట్టిన రోజు వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లిలో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండా మురళి పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి సమక్షంలో పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రంగు హరీశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాజు, భాస్కర్, బాపిరాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్: విద్యార్థులు, ప్రజలు మూఢనమ్మకాలు విశ్వసించకుండా శాస్త్రీయ దృక్పథాన్ని అవర్చుకోవాలని ఎస్సై జి.వేణు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తిరుమల స్వామి కాలనీలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన, మ్యాజిక్ షో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

జఫర్‌గఢ్: శ్రీవెల్పుగొండ లక్ష్మీనరసింహస్వామి మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాముల నవీన్ అధ్యక్షతన తిడుగు గ్రామ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శ్రీరాముల రవీందర్, ఉపాధ్యక్షుడిగా ముత్తులింగం, ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య, కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: అక్రమ కాంటాలతో రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై చర్య తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి గుగులోత్ మధునాయక్ అధికారులను కోరారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో బుధవారం అక్రమంగా కాంటాలు పెట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులను అడ్డుకుని మాట్లాడారు. రైతులకు గిట్టు బాటు ధర చెల్లించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా కొందరు వ్యాపారులు రైతులకు మాయ మాటలు చెప్పి కొనుగోలు చేశాక మద్దతు ధర లేకుండా చేస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాటర్ డిస్పెన్సరీ అందజేత



జనగామ రూరల్: విద్యార్థుల సౌకర్యార్థం పెంబర్తి మహిళా డిగ్రీ కళాశాలకు దాత ఆరె మోహన్ దాస్ బుధవారం వాటర్ డిస్పెన్సరీని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీఎస్ చారీ వాటర్ డిస్పెన్సరీ అందజేసిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఏటీపీ మాధురి, డిప్యూటీ వార్డెన్ లావణ్య పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్మకు పాల్పడిన మండల కేంద్రానికి చెందిన తరాల మమత అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. కాగా, పలువురు నాయకులు పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. రాఘవరావు, వీరమనేని యాకాంతరావు, గణేష్, శ్రీనివాస్ ఉన్నారు.

జయప్రదం చేయండి

చిల్పూరు: ఈనెల 26వ తేదీన వరంగల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలని నలిమెల నాగరాజు కోరారు. ఈ మేరకు మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం మహాసభ సన్నాహక సమావేశం రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. మండల ఇన్‌చార్జ్ అరూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై రాజు

కొడకండ్ల: మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన బానోత్ గణేష్ మండలకేంద్రానికి చెందిన మసురం యాదగిరి ఇంటిని కిరాయికి తీసుకొని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా రూ.20కి కొనుగోలు చేసి రూ.40కి విక్రయించేందుకు కిరాయి ఇంట్లో అక్రమంగా నిల్వ చేశాడు. పద్మశాలీ బజార్‌లో పోలీసులతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకొని గణేష్‌ను విచారించగా పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రెట్టింపు ధరకు విక్రయించేందుకు నిల్వ చేసినట్లు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. రూ.32వేల విలువ చేసే రేషన్ బియ్యాన్ని అశోక్‌లేల్యాండ్ వాహనాన్ని పీఎస్‌కు తరలించి గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అతిథి గృహంలో అన్నదానం



జనగామ రూరల్: పట్టణానికి చెందిన మహ్మద్ సుల్తానా బేగం జ్ఞాపకార్థం బుధవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసరమడ్ల లోని అతిథి గృహంలో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి, వంగ బీం రాజ్, బషీర్ మహేష్, కార్తీక్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము లేస్తోంది..

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, దుకాణ దారులు



చౌరస్తాలో వాహనాలతో లేస్తున్న దుమ్ము

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి వాహనాలు వెళ్లినప్పుడు విపరీతమైన దుమ్ము లేస్తోంది. దీంతో ప్రయాణికులు, దుకాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన చౌరస్తా మీదుగా చేర్యాల, ఆలేరు, జనగామ మూడు పట్టణాలకు వెళ్లే దారులు ఉన్నాయి. ప్రతి నిత్యం ఈ చౌరస్తా నుంచి వందల వాహనాలు వెళ్తుంటాయి. అలాగే పలువురు పాత బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ వరకు కాలినడకన వెళ్తుంటారు. పనుల నిమిత్తం వచ్చిన వారు, గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ వేచి ఉంటూ దుమ్ముతో అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.